# బాండుంగ్ వెలుగు నీడలో....

[చైనా- భారతమైత్రి సంక్షిప్త చరిత్ర, రచన చిన్ కే-మూ, అనువాదం 'సహవాసి'. భారత-చైనా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్]

చరిత్రలు పలురకాలు. సామ్రాజ్యవాద చరిత్ర, జాతీయవాద చరిత్ర, మతోన్మాద చరిత్ర, వగైరా ఎన్నికావాలంటే అన్నిరకాలు. సామ్రాజ్యవాదులకు వలసలను నిరాటంకంగాను నిరాక్షేపణీయంగాను పరిపాలించడానికి ఒక చారిత్రక వ్యాఖ్యానం అవసరమయింది. పరిపాలనా దక్షత తెల్లవాడిసొమ్ము. కాబట్టి ప్రపంచపాలన కేవలం వాడి హక్కేకాదు, దైవదత్తమయిన బాధ్యత. ఈసిద్ధాంతాన్ని నిరూపించడానికి వలస దేశాల చరిత్రను సామ్రాజ్యవాదపు కళ్ళతో పరిశీలించి రాసారు. ఈ ప్రాచ్యదేశాల వాళ్ళకు తత్వచింతన సమృద్ధిగా వుందిగాని, రాజ్యం నడపకుంటే తన్నుకు చావడమో లేక సన్యసించడమో తప్పవేరే చేతకాదు అని నిరూపించదల్చుకున్నారు. అందుకేవాళ్ళ కళ్ళకు మన చరిత్ర నిండా కలహాలూ కుహకాలూ కాషాయాంబరాలూ తప్ప వేరే కనబడలేదు. దీనికి సమాధానంగా జాతీయవాద చరిత్ర పుట్టి చరిత్రలో పూడుకుపోయిన రాజ్యాలనూ రాజవంశాలనూ వెలికి తీసి, చూసారా మాకూ పరిపాలనా దక్షత వుందని ఎదురు వాదన చేసింది. గుప్త రాజుల స్వర్ణ యుగం, అక్బర్ పాదుషా నేర్పరితనం చరిత్రకెక్కాయి, అవే చరిత్ర అయ్యాయి. చివరికి వేరే సందర్భంలోనయితే నీతి హీనుడిగా గుర్తించబడివుండే కౌటిల్యుడు గూడ భారతజాతికి తత్వచింతనే కాదు, అతి క్షుద్రమయిన రాజనీతిగూడ చేతనవునని నిరూపించి జాతి హీరో అయ్యాడు ! ఇట్లా ఎన్నో రకాల చరిత్రలు వర్ణించవచ్చు.

---

పుస్తకంగా తీసుకువచ్చేప్పుడు పూర్తి వైరుధ్యముండే రచనల్ని పక్కపక్కన వుంచితే అది గందరగోళాన్ని పెంచుతుంది. రచయితపట్ల చులకనభావం కలిగే ప్రమాదమూ వుంది. అందులోను కళప్రయోజనాన్ని గుర్తించి ఓ సిద్ధాంతానికికట్టుబడాలంటే ఈ ధోరణి మరీ ప్రమాదం.

కాలువ మల్లయ్యగారు పొగడ్తలను పక్కనబెట్టి అవగాహన పెంచుకుంటే మంచిరచనలు చెయ్యొచ్చు. అలాచేస్తారనీ ఆశించవచ్చు.

— బి. వి. ప్రసాద్

మరయితే భారత - చైనా మిత్ర మండలి వారు అనువదించి ప్రచురించిన ఈ చైనా పుస్తకం ఏ రకం చరిత్ర అంటే, బాండుంగ్ చరిత్ర, లేక పంచశీల చరిత్ర, అనొచ్చు. 1955 లో బాండుంగ్‌లో ఒకసమావేశంజరిగింది. అప్పుడప్పుడేసామ్రాజ్య వాదుల నుండి ఏదో ఒక మేరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంటూన్న వివిధఆఫ్రికా ఆసియాదేశాల అధినేతలంతా అక్కడ సమావేశమయ్యారు. మునిసిపల్ పార్కులో ప్రేమికులలాగా జన్మాంతం తోడునీడగా వుంటామని ప్రకటించుకున్నారు. ప్రపంచరాజకీయ రంగంపైకి ముగ్గురు తాజా హీరోలు వచ్చారు —నెహ్రూ, నాజర్, సుకర్నో. తాజాతనంలోగాని హీరోయిజంలోగాని ముగ్గురూ ముగ్గురే. వీళ్ళవెనక నిలబడి వీళ్ళ వేడి వేడి రాడికల్ ప్రవచనాలకు కొంతస్థిరమయిన పునాదిని కల్పించాలని చౌ ఎన్ లై ప్రయత్నించాడు.

అది 1955లో. అంతకు ఒకసంవత్సరం పూర్వం చౌ ఎన్ లై భారత దేశానికి వచ్చాడు. ఢిల్లీ నగరం హిందీ-చీనీభాయిభాయి నినాదాలతో మారుమ్రోగింది. భారతచైనా దేశాలు స్నేహ ఒప్పందాన్ని రాసుకున్నాయి. పంచశీల అనిపిలవబడే అయిదు సూత్రాలు ప్రాతిపదికగా రెండు దేశాలూ స్నేహసహకారాలతో సహజీవనం చేయాలని ప్రమాణం చేసుకున్నాయి. ఒండొరుల సర్వసత్తాక ప్రతిపత్తిని గౌరవించాలి. ఒకరిపై ఒకరు దాడి జరపకూడదు. ఒకరి అంతర్గత వ్యవహారాలలో ఒకరు జోక్యం చేసుకోకూడదు- పరస్పరలాభోపేతంగాను, సమానంగాను, వ్యవహరించాలి. శాంతియుత సహజీవనం కొనసాగించాలి. ఇది 'పంచశీల-,

అది 1954లో. ఈ పుస్తకంరాసింది 1958లో. అంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని మాజీ వలసదేశాల ప్రభుత్వాలనూ ఐక్యంగా నిలబెట్టాలనే రాజనీతిని చైనా ప్రభుత్వం అనుసరిస్తూన్న రోజులలో, ఆ రాజనీతిలో భాగంగా, రాసిన పుస్తకం ఇది. ఆ రాజనీతి ఆనాడుగాని ఈనాడుగాని తప్పుకాదు. అన్ని రకాల సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా 'మూడవ ప్రపంచ' దేశాలను ఐక్యంగానిలబెట్టే కృషి చాలా అవసరం. దానికోసం ఆయా ప్రభుత్వాలతో చైనా సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రయత్నించడం భావ్యమే. అది ప్రభుత్వాల మధ్య మైత్రే, 'ప్రజల మధ్యమైత్రి' అని బుకాయించాల్సిన అవసరం లేదు. ప్రజల మధ్య మైత్రి ఈ ప్రభుత్వాలు పోతేగాని సాధ్యం కాదు. అయితే ఈ మైత్రే రాజనీతికి చరిత్ర రచనను లోబరిస్తేనే కష్టం. ఒక్కసారిగా భారతదేశం, చైనా, అఖండమయిన 'జాతు'లయిపోతాయి భారత పాలక వర్గాలకు అభిమానపాత్రమయిన విషయాలు విమర్శకు అతీతమయి

పోతాయి. భారతదేశంనుండి చైనాకుగాని చైనానుండి భారతదేశానికిగాని వ్యాపారానికో బౌద్ధమత ప్రచారానికో ఉబుసుపోకకో ప్రయాణించిన వారంతా ఆయాదేశాల ప్రజల ప్రతినిధులవుతారు, వాళ్ళ ప్రయాణం అనాది అయిన భారతచైనా మైత్రికి సంకేతం అవుతుంది. వాళ్ళ రాకపోకలవల్ల ప్రసారమయిన సంస్కృతి ఎటువంటిదయినప్పటికీ పూజనీయమవుతుంది. "చైనా వచ్చిన భారతీయ బౌద్ధమత ప్రచారకులు మన నాగరికతను సుసంపన్నం చేసారు.... ఉభయదేశాల మధ్య సాగిన భావాల బట్వాడాను ఒక్కసారి గతంలోకిపోయి చూసినప్పుడు, భారతదేశము నుంచి బహుప్రయాసలు పడి చైనా వచ్చిన ఈ భారతీయ మిత్రుల్ని, శతాబ్దాల తరబడి వాళ్ళు శ్రమించి చేసిన బోధల్ని, అనువాదాల్ని, జ్ఞాపకము తెచ్చుకొని తీరాలి, మన ఉభయదేశాల ప్రజల మధ్య అల్లుకున్న ఈ ప్రగాఢ మైత్రి ప్రపంచ చరిత్రలో అసాదృశ్యం" (పేజీ 76)

మరికొన్ని ఉదాహరణలు ఇస్తాను బౌద్ధమతప్రచారంకోసం ఉభయదేశాల మధ్య జరిగిన ప్రయాణాల గురించి చెప్తూ "3వ శతాబ్దంనుండి 12వ శతాబ్దందాకా సాగిన ఈవెయ్యిసంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎడతెగకుండ పారేఏరులాగా యాత్రిక బృందాలు చైనానుండి భారతదేశానికి కష్టసాధ్యమయిన దీర్ఘ, నిష్ఠుర, ప్రయాణానికి తెగించాయి. వాళ్ళలక్ష్యం లాభాలు లాగుదామని కాదు. కీర్తిగడిద్దామనికాదు. దురాక్రమణ యుద్ధం అంతకన్నకాదు. జ్ఞానతృష్ణ, బౌద్ధమతవ్యాప్తి, వాళ్ళకు ప్రేరణలు. ఇటువంటి ఉదాహరణ యావత్ ప్రపంచచరిత్రలో మరెక్కడా కనిపించదు. ఈఅసాధారణ చారిత్రక పరిస్థితులు చైనా-భారత ప్రజలమధ్య స్నేహసంబంధానికీ, మనపూర్వుల ఉన్నత గుణ గణాలకు, విశిష్ట సాక్ష్యం". (పేజీ 41) ఈ ఉభయజాతీయవాదం (mutual nationalism) మన ఇరువురి పూర్వీకులలో ఉన్నత గుణగణాలను గుర్తించడంతో ఆగిపోలేదు. ముందుమాటగా భారత చైనా మిత్రమండలి ఆంధ్రరాష్ట్రశాఖవారు రాసిన దానిలో, "పూర్వంభారతదేశానికి పశ్చిమదేశాలతో సంబంధంయుద్ధాల ద్వారా ఏర్పడగా చైనాతో భారతదేశానికి సంబంధం పరస్పర సహకార ప్రాతిపదికగా ఏర్పడింది" అన్నారు. ఇది చాలా అన్యాయమయిన వక్రీకరణ. చైనాతో భారత దేశానికుండిన మతప్రచార వ్యాపార సంబంధాలను 'పరస్పర సహకారం'గా గుర్తించేటట్లయితే ఆ సంబంధమే పశ్చిమదేశాలతోగూడ వుండింది. నాదిర్‌షా, గజనీమహమ్మదుల దండయాత్రలకంటె ఈ సంబంధమే ఎంతో బలమయినది.

నిజానికి 'జ్ఞానతృష్ణ' చేత ప్రేరణ చెందిన బౌద్ధభిక్షువులేకాదు, లాభార్జన కోసం వ్యాపారస్తులుగూడ చాలా మంది ఉభయ దేశాల మధ్య ప్రయాణం చేసారు.

భారతచైనా దేశాల సంబంధాలలో అదిగూడ ఒక భాగమే. అందులో సిగ్గుపడాల్సిందేమీలేదు. ఇతర దేశాల వాళ్ళకు లాభార్జన దృష్టి వుండిందని, కేవలం భారత చైనా దేశాల పూర్వీకులకే అకళంక జ్ఞానతృష్ణ వుండిందని, వాళ్ళగుణగణాలు ఉన్నతమయినవని నమ్మడం చాలా అశాస్త్రీయం. అట్లానమ్మాలని పంచశీలలో సహితంరాసుకోలేదు. పైగా ఈ వ్యాపారస్తులూ బౌద్ధభిక్షువులూ మోసుకుపోయినవన్నీ మంచివికావు. మంచివన్నీ 'జ్ఞానతృష్ణ' మాత్రమే వున్న భిక్షువులు మోసుకు పోయినవి కావు. సాంకేతిక పరిజ్ఞానం, గణితం, వైద్యం, ఖగోళశాస్త్రం - ఇవి మనం ఇచ్చి పుచ్చుకున్న వాటిలో మంచి అంశాలు. వీటివల్ల రెండుదేశాల సంస్కృతులూ సంపన్న మయినాయి. వీటిలో వ్యాపారస్తులు మోసుకపోయినవీ వున్నాయి. బౌద్ధ భిక్షువులు మోసుకుపోయినవీ ఉన్నాయి. భిక్షువులు మాత్రమే తీసుకపోయినవి. సంస్కృతభాష, సాహిత్యం, తత్వశాస్త్రం, బౌద్ధ మత పుక్కిటి పురాణాలు, వగైరా. సాహిత్యం మాటఏమోగానీ, తత్వశాస్త్రం, బౌద్ధమతం, అనాటికి (క్రీ. శ. 3వ శతాబ్దం తరువాతకాలం) బాగా దిగజారి ఉన్నాయి. దురదృష్టవశాత్తు, భారత పాలక వర్గాలను దృష్టిలో వుంచుకొని కాబోలు, ఈ రెండవ కోవకు చెందిన సరుకులనే భారతదేశంనుండి చైనా పొందిన గొప్ప ప్రయోజనంగా చెప్పారు. కొన్ని ఉదాహరణలిస్తాను. ఫాహియాన్ భారతదేశానికి వచ్చింది బౌద్ధమఠాల నిర్మాణానికీ (organisation) వ్యవహారాలకూ సంబంధించిన నియమావళిని తెలుసుకు పోవడానికి. దానివల్ల చైనా ప్రజలకు ఒరిగిందేమిటో మనకుతెలీదు. కాని ఈ బాండుంగ్ చరిత్ర మాత్రం ఫాహియాన్ సాహసాన్ని ప్రశంసిస్తూ, "ఫాహియాన్ ఇటువంటి సుదీర్ఘ, సంక్లిష్ట ప్రయాణానికి సిద్ధపడింది తనకోసం కాదు, తన దేశస్తుల ప్రయోజనంకోసం" అంటుంది. (పేజీ45) హుయాన్‌సాంగ్ క్రీ. శ. 7వ శతాబ్దంలో భారతదేశానికి వచ్చాడు. ఇక్కడ వేరే బౌద్ధశాఖకు చెందిన ప్రజ్ఞాదేవుడనే భిక్షువుతో ఏదో వాదనకు దిగుతాడు. ఆ వాదనలో పౌరుషంగా మాట్లాడినందుకు ప్రజ్ఞాదేవుడు క్షమాపణ వేడుకుంటూ ఉత్తరం పంపితే దానికి సమాధానంగా హుయాన్‌సాంగ్, ఇందులో క్షమాపణ కోరుకోవలసిందేమీలేదని అంటాడు. క్రీ. శ. 7వ శతాబ్దంనాటికి భారత దేశంలో బౌద్ధానికి పట్టిన గతిఏమిటో తెలిసిన వాళ్ళు ఆ పండితులచర్చ ఎంతనిరర్థక మయివుంటుందో ఊహించుకోగలరు. కాని ఈ పంచశీల చరిత్రకు మాత్రం అట్లా అనిపించలేదు. "అనాటి పండితులు వినయసంపన్నులు, సహృదయులు, మానవజాతి ప్రగతిని మాత్రమే కాంక్షించిన వాళ్ళు. వ్యక్తిగత కక్షలు, సంకుచిత పక్షపాతాలూ బొత్తిగా ఎరుగని వాళ్ళు. ఈ విషయాల్లో

వాళ్ళని మనంగొప్ప ఆదర్శంగా స్వీకరించాలి" అంటుంది. (పేజీ 54) అదే సందర్భంలో, "హుయాన్‌సాంగ్ చైనానుగురించి చెప్పిన విశేషాలయెడల హర్షచక్రవర్తి మహా ఆసక్తి కనబరిచాడు. వారిద్దరూ మంచి స్నేహితులయ్యారు. భారతచైనా దేశాల ప్రజల మధ్య ఆనాడు విలసిల్లుతున్న స్నేహానికిది అభివ్యక్తి" అంటుంది. హర్షుడికీ ప్రజలకూ తేడాచూడలేని ఈ విచక్షణా శూన్యమయిన మైత్రీభావ అతిశయం అవసరమా? అది ప్రదర్శించకపోతే ఇవ్వాళ భారత- చైనా మైత్రి అసాధ్యమా ?

విచిత్ర మేమిటంటే, భారత చైనా దేశాలు నిజంగానే చాలా ఉపయోగకరమయిన విషయాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రాచీనకాలంలో విజ్ఞానశాస్త్రంలో (ముఖ్యంగా ఖగోళశాస్త్రం, గణితం, వైద్యం) రెండుదేశాలూ ఎంతోకొంత అభివృద్ధి సాధించాయి. సాంకేతికరంగంలో నాదేకాదు, పెట్టుబడిదారీ విప్లవం పాశ్చాత్యదేశాలలో వచ్చేదాకా, ప్రపంచంలో బహుశా చైనాదే పైచేయి. ఈ విద్యనూ విజ్ఞానాన్నీ భారత చైనా దేశాలు పంచుకున్నాయి. అందుకు వచ్చేపోయే యాత్రికులు (లాభార్జన లక్ష్యంగా గల వ్యాపారస్తులు, 'జ్ఞానతృష్ణ'తో ప్రయాణం చేసిన భిక్షువులు) తోడ్పడ్డారు. ప్రాచీన భారత చైనా సంబంధాలలో ఇది ధనాంశ. మిగిలినదంతా (చాలావరకు) ఋణాంశే. బౌద్ధం చైనాలో స్థిరపడేనాటికి తాత్వికరంగంలో వేదాంతానికి ఏమాత్రం తీసిపోని మహాయానంగాను, నిత్యజీవితంలో బుద్ధభగవానుని ఆరాధనగాను, మూఢనమ్మకాల మూటగాను, మారి పోయింది. ధనాంశను మొదటి 15 పేజీలలో కొంత వివరించి ఋణాంశనే మిగిలిన పేజీలలో గొప్పగా కీర్తించారు.

భారతదేశంలోనూ చైనాలోనూ గూడ నాగరికత చాలా ప్రాచీన మయినది. రెండూగూడ ఋతుపవన వాతావరణంలో జీవించే దేశాలే. వ్యవసాయానికయినా నౌకాయానానికయినా ఒక క్రమంప్రకారం వీచే ఋతుపవనాలే ఆధారం. కాబట్టి సంవత్సరిక పంచాంగం (అంటే శకునాల పుస్తకం అని కాదు, కేలెండర్ అని అర్థం) తయారుచేసుకోవడం అవసరం. అది లేక పోతే వ్యవసాయం పనులు ఎప్పుడు ప్రారంభించాలో తెలీదు, సముద్రంలో ఓడలు ఎప్పుడు బయలుదేరవచ్చునో తెలీదు. దీనికోసం గ్రహాల, నక్షత్రాల, పరిశీలన మొదలయింది. ఈ కారణంగా రెండు దేశాలలోనూ అతి ప్రాచీనకాలంలో అభివృద్ధి చెందిన విజ్ఞానశాస్త్రం ఖగోళశాస్త్రం. దానికి అనుబంబంధంగా గణితం. ఈ విజ్ఞానాన్ని పరస్పరం పంచుకున్నాయి. ఖగోళశాస్త్ర గ్రంథాలు తీసుక పోవడమేకాక, బౌద్ధమత గ్రంథాలలో గూడ ఖగోళ శాస్త్రానికి

సంబంధించి చాలా విషయాలు చెప్పబడి ఉండేవట. క్రీ. శ. 7-8 శతాబ్దాల కాలంలో చైనాను టాంగ్ రాజవంశం పరిపాలిస్తున్న రోజులలో కేలెండరు తయారుచేసే విభాగంలో చాలామంది భారతీయ పండితులు పనిచేసేవారట. చాంద్రమాసాన్ని కృష్ణ పక్షం - శుక్లపక్షం అని విభజించే అలవాటుగూడ చైనీయులకు మననుండే అబ్బిందట (పేజీ 11). వైద్యం మాటకొస్తే, సుమారు 100 భారతీయ వైద్య గ్రంథాలు అనువాద మయ్యాయట. అవిగాక, బౌద్ధ భిక్షువులు చాలామంది మంచి వైద్యులు కావడాన, వాళ్ళు చైనాకు పోవడం ద్వారా గూడ ఇక్కడి వైద్య విజ్ఞానం అక్కడికి చేరివుంటుంది. బౌద్ధమత గ్రంథాలలో గూడ వైద్య సంబంధమయిన సమాచారం విస్తృతంగా ఉంటుందట (పేజీ 13).

ఇదంతా చైనా భారతదేశంనుండి నేర్చుకున్నది. భారతదేశంగూడ చైనా నుండి ఈ రంగాలలో ఎంతోనేర్చుకొని ఉండాలి. అదనంగా, సాంకేతిక రంగంలో మనం చైనానుండి చాలా స్వీకరించాం. పట్టునుండి పింగాణీ వరకు చాలాసరుకుల తయారీ, వాడకం, చైనా నుండి నేర్చుకున్నవే. ఈ పుస్తకం వ్రాసిన కాలానికి తెలీదు గాని, భారతదేశానికి రాట్నం, కాగితం, సారాకాచే బట్టీలు, ఇటికలు, బావిగిలకలకు ఉపయోగించే గేర్‌వంటి పరికరం, సైనిక సంబంధ మయిన సాంకేతిక విజ్ఞానం, ఢిల్లీసుల్తాన్ల కాలంలో దిగుమతి అయ్యాయనీ, వాటిలో కొన్ని చైనానుండి పర్షియా ద్వారా ఇండియాకు వచ్చి ఉండవచ్చుననీ, ఇటీవల ఇర్ఫాన్ హబీబ్ అన్నాడు.

సాంకేతిక, వైజ్ఞానిక, రంగంలోని ఈ ఇచ్చిపుచ్చుకోలు నిజంగా ప్రాచీన కాలంలో భారత-చైనా మైత్రికి సంకేతం. ఇవ్వాళ్టి మైత్రికి ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి కంటె వేరే ప్రేరణ కావాలను కుంటే ఈ ప్రాచీన సంబంధాన్ని చెప్పుకుంటే చాలు. విచక్షణా శూన్యంగా అభ్యుదయం అయినదేది కానిదేది అన్న తేడా చూడకుండ నాగార్జునుడి శూన్యవాదం చైనా భాషలోకి అనువాదమయినా హర్షుడు హుయాన్ సాంగ్‌తో స్నేహపూర్వకంగా ప్రవర్తించినా, అన్నీగూడ భారత చైనాప్రజల మైత్రికి నిదర్శనాలేనని తీర్మానించడం శుష్క-శాపత్రయం. చరిత్ర రచనకు రాజకీయం ఎప్పుడూ ఉంటుంది. కాని ఆ రాజకీయం దీర్ఘకాలిక మానవాభ్యుదయం అయితేనే ఆ చరిత్ర రచన శాస్త్రీయం అవుతుంది. తాత్కాలిక బాండుంగ్ రాజనీతికి భారతచైనా సంబంధాల చరిత్రను లోబరచి భారత పాలక వర్గాలను మెప్పించడానికి హిందీ-చీనీ భాయి భాయి నినాదాన్ని పల్లవిగా చరిత్ర రాయడం అనవసరం. దాన్ని

—కొరవ 77వ పేజీలో

సాహిత్య లేఖ :

# 'లయ' గురించి . . .

—జుగాష్ విలి

అరుణతార (35-36) లో కవితాసంకలనం 'లయ' సమీక్ష చేసాను. దానిపై 'లయ' ప్రచురణకర్తలైన హయగ్రీవాచారమ్ వేములవాడవారు అరుణతార (38) లో సాహిత్యలేఖ ఒకటి రాసారు. 'ఇప్పుడు వస్తున్న పుస్తకసమీక్షలు పాక్షికంగా వస్తున్నాయనడానికి నిదర్శనం'గా ఈ సమీక్ష వుందన్నారు. జింబో- శివకుమార్ కవితలు గురించి రాయడం దీనికి నిదర్శన మన్నారు.

జింబో కవిత 'బతుకు' గురించి రాస్తూ "ఈ వ్యవస్థలో మనం బతికింది తొమ్మిది మాసాలే ననడంలో నిరాశ పలాయన ధోరణులు కన్పిస్తున్నాయి. తల్లి గర్భంనుండి బయటపడిన తరువాత బతికే బతుకు బాగాలేదని కవి భావన. బాగా లేకపోతే మార్చుకోవాలి. బతుకు మార్పుకోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి" అన్నాను. కవి భావనగా నేను ఏమి చెప్పానో సాహిత్యలేఖలో కూడా వారు అదే చెప్పారు. మనిషి సామాజిక జీవితం ప్రారంభమయ్యేది తల్లిగర్భంనుంచి బయటపడి నప్పటినుంచే కాగా, తల్లిగర్భంలో వున్న తొమ్మిది మాసాలే మనం బతికింది అనడంలో మరేమి కన్పిస్తున్నాయి. నేను విమర్శ పెట్టిన శివకుమార్ కవితలు 'దోపిడి' 'ఛీ' గురించి ఆ లేఖలో వారు సమర్థించుకోలేదు. మిగతా ముగ్గురి కవితల గురించి 'టచ్' చేయలేదనడం పొరపాటు. ఈ సంకలనంలో వున్న రచయితల ఐదుగురి కవితలలో కొన్ని పేర్కొని బాగున్న కవితలలో యివి కొన్నిమాత్రమేనని చెప్పాను. అన్ని కవితల గురించి ప్రస్తావించడం సాధ్యపడదు. వ్యక్తులపట్ల పాక్షికవైఖరి తీసుకోవలసిన అవసరం నాకు ఎంతమాత్రం లేదు. 'జీవిత సంఘర్షణ'కు ప్రతిస్పందిస్తున్న ఈ రచయితల పట్ల నాకు స్నేహపూరిత అభిమానమే వుంది.

ప్రతి కవితలోనూ విప్లవ పదజాలం వుండనవసరం లేని మాట నిజమే. పోరాటం - ఎర్రజెండా 'సోది'గా "ఉత్త వెర్రి"గా భావిస్తున్న వీరు "విప్లవ పదజాలం లేకుండా రాయడమే యిప్పుడు కావల్సింది" అనడంలో ఆశ్చర్యం లేదు. దీనికి పునాది సాహిత్య సంస్థకు మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం ప్రాపంచిక దృక్పథంగా వుండనవసరం లేదన్న వాదనలోనే వుంది. విప్లవ సాహిత్యంలో విప్లవ పదజాలం అనివార్యంగానే చోటు చేసుకొంటుంది. నక్సల్‌బరి పేరు చెప్పకుండా భారతదేశ విప్లవోద్యమం గురించి చెప్పడం ఇవ్వాళ సాధ్యంకాదు.

'కవిత్వం అంటే పాట అని కూడా అర్థం' అని అంగీకరిస్తున్నప్పుడు ముందుమాటపై నా కామెంటుతో వీరికి పేచీయే లేదు.

వచన కవితలు రాసేవాళ్ళు బృందాలుగా ఏర్పడి గ్రామీణ ప్రాంతాలకి పోయి కవితల్ని చదివి వినిపించండి. ప్రజల్తో మమేకం కాకుండా ప్రక్రియా చర్చలు శుద్ధ దండగ.

---

—75వ పేజీ తరువాయి

ఉన్నదున్నట్లుగా తెలుగులోకి అనువదించి 'దేశభక్తి' పేరిట చలామణి అవుతూన్న జాతీయ దురభిమానం ప్రభావం నుండి బయట పడని ప్రజలను మరింత గందరగోళ పరచడం ప్రమాదకరం.

'సహవాసి' అనువాదం ఎప్పటిలాగే ధారావాహికంగా వుంది. భాషమాత్రం ఉండగలిగినంత సరళంగా లేదు. 47 వ పేజీలో 'వెస్టర్న్ కాంట్రీస్' అన్నమాటను తూర్పుదేశాలు అని అనువదించారు. మరొకచోట (పేజీ 32) సర్వే అన్న ఇంగ్లీష్ మాటను సర్వేక్షణ అని అనువదించారు. ఇది సరికొత్త ప్రయోగం. పుస్తకం మొదటి నుండి చివరిదాకా 'మన' 'మనము' అని వుండవలసింది 'మా' 'మేము' అని వుంది.

కె. బాలగోపాల్

---

## ప్రదర్శించి చూడండి

చెరబండరాజు నాటకం, నాటికలూ విరసం యూనిట్లూ, ఇతర విప్లవ సంఘాలూ ప్రదర్శించి చూడండి. మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. కృష్ణా జిల్లా ఉప్పులూరులో జననాట్యమండలి 'గ్రామాలు మేల్కొంటున్నాయి' నాటకం ప్రదర్శించారు. ప్రజలు బాగా రిసీవ్ చేసుకున్నట్టు వాళ్ళు తెలియజేశారు. ఈ నాటకం అరుణతార మేనేజర్ దగ్గరా, సృజనవద్దా దొరుకుతుంది.

—మధుసూదనరావు